# కేసీఆర్ చేతిలోనే రాష్ట్రం సుభిక్షం



బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్‌కు స్వాగతం పలుకుతున్న మల్కాపూర్ గ్రామస్తులు



మంత్రి గంగులను గజమాల వేసి సన్మానిస్తున్న మల్కాపూర్ గ్రామ యువకులు

- కాంగ్రెస్, బీజేపీకి ఓటేస్తే వెళ్లేది ఢిల్లీకే
- ఆంధ్రోళ్లకు మనకు జరిగే యుద్ధమే ఈ ఎన్నిక
- ఎంపీగా గెలిపిస్తే కనిపించని బండి సంజయ్.. ఎమ్మెల్యేగా ఏం చేస్తడు?
- రాష్ట్రంలో రెండు సీట్లు కూడా గెలువని పరిస్థితి బీజేపీది
- నన్ను మరోసారి గెలిపించండి.. మరింత అభివృద్ధి చేస్తా
- బీఆర్ఎస్ కరీంనగర్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్

కొత్తపల్లి, నవంబర్ 14 : సీఎం కేసీఆర్ చేతిలో ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, కాంగ్రెస్, బీజేపీకి ఓటేస్తే ఢిల్లీకి వెళ్తాయని అని కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. ఈ మేరకు కొత్తపల్లి మండలం మల్కాపూర్, లక్ష్మీపూర్ గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించగా మహిళలు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి గడపగడపకూ వెళ్లి ప్రచారం చేశారు. ఆయాచోట్ల ఆయన మాట్లాడుతూ, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి పనులు, తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ పథకాలు తనకు నాలుగోసారి విజయం అందిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌ను గెలిపిస్తే మాయమై నాలుగున్నరేళ్లుగా ప్రజలకు చేసిందేమీ లేదని, ఒక్క రోజు కూడా గ్రామాలను సందర్శించిన దాఖలాలు లేవని మండిపడ్డారు. బీజేపీ, కాంగ్రెస్ దొంగ పార్టీలని, వారికి పవిత్రమైన ఓటు వేసి వృథా చేసుకోవద్దని సూచించారు. సమైక్య పాలనలో మల్కాపూర్ అభివృద్ధికి నోచుకోలేదని గుర్తు చేశారు. ఆంధ్రోళ్లే ముఖ్యమంత్రులు కావడంతో తెలంగాణ ప్రాంతం తీవ్ర వివక్షకు గురైందన్నారు. స్వయం పాలనలో కరీంనగర్‌ను గొప్పగా అభివృద్ధి చేశానని, మరోసారి గెలిపిస్తే వచ్చే పదవులతో మరింత సేవ చేస్తానన్నారు. పచ్చని తెలంగాణను చూస్తే ఆంధ్రోళ్ళకు కంటగింపుగా ఉందని, ఢిల్లీ పార్టీలతో కుమ్మక్కై తెలంగాణను మళ్లీ దోచుకునేందుకు సిద్ధమయ్యారని మండిపడ్డారు. కొట్లాడి తెచ్చుకున్న కేసీఆర్ చేతుల్లోనే సుభిక్షంగా ఉంటుందని మోసపోతే గోసపడక తప్పదని హెచ్చరించారు. తనను నాలుగోసారి గెలిపించి ఐదేళ్ల పాటు సేవ చేసుకొనే భాగ్యాన్ని కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి శ్రీలత మహేశ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కాసారపు శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ గొట్టె జ్యోతి పోచయ్య, ఎంపీటీసీ పండుగ గంగమ్మ నర్సయ్య, బీఆర్ఎస్ నియోజకవర్గ యువత ప్రధాన కార్యదర్శి గంగాధర చందు, ఉప సర్పంచ్ కాసారపు గణేశ్‌గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గంగాధర లక్ష్మయ్య, మాజీ సర్పంచ్ బొమ్మ ఈశ్వర్‌గౌడ్, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పెరుమళ్ళ జనార్ధన్, సీనియర్ నాయకులు ఒల్లాల మల్లేశం, శ్రీనివాస్, జగన్‌రెడ్డి, పల్లె రవీందర్‌గౌడ్, గొల్లపల్లి వెంకటేష్, భారత్, అరుణ్ పాల్గొన్నారు.



గన్నేరువరం: చొక్కారావుపల్లిలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు బొట్టు పెడుతూ, మంగళ హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

# కాంగ్రెస్ మాయలో పడి ఆగం కావద్దు

- ఆ పార్టీకి ఓటేస్తే కష్టాలు తెచ్చుకోవడమే
- ఎన్నికలు రాగానే కవ్వంపల్లి వస్తున్నడు
- కరోనా సమయంలో ఎక్కడున్నడు
- సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి
- మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

గన్నేరువరం, నవంబర్ 14 : ''కాంగ్రెస్ మాయలో పడి ప్రజలు ఆగం కావద్దు.. ఆ పార్టీకి ఓటేస్తే కష్టాలు కొని తెచ్చుకోవడమే.. 24 గంటలు కరెంటిచ్చే బీఆర్ఎస్ కావాలా..? 3 గంటల కరెంటిచ్చే కాంగ్రెస్ కావాలా..? రైతులే తేల్చుకోవాలి'' అని మానకొండూరు బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సూచించారు. ఈ మేరకు ఆయన మంగళవారం గన్నేరువరం మండలంలోని పీచుపల్లి, చొక్కరావుపల్లి, చాకలివానిపల్లి, మైలారం, హన్మాజిపల్లి గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రసమయి మాట్లాడుతూ సమైక్య రాష్ట్రంలో కరెంటు, సాగునీరు, తాగునీటి కోసం అరిగోస పడ్డామని గుర్తు చేశారు. రైతులపై కాంగ్రెస్ విషం కక్కుతుందని, రైతుబంధు, రుణమాఫీ ఆపాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిందని మండిపడ్డారు. 60 ఏండ్ల పాలనలో అభివృద్ధి చేయనోళ్లు ఇప్పుడు ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఎన్నికలు రాగానే కవ్వంపల్లి వస్తున్నాడని, కరోనా సమయంలో ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలోని అంశాలను వివరించారు. అభివృద్ధి చేసిన తనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్‌తో పాటు కాంగ్రెస్, బీజేపీ నాయకులు, మతానికి చెందిన 200 మంది బీఆర్ఎస్‌లో చేరగా ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు వెంకన్న, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



రామడుగులో ప్రచార ర్యాలీలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె, నాయకులు, కార్యకర్తలు

# మోసపోతే గోసపడుతం

- బీఆర్ఎస్ అంటే వెలుతురు.. కాంగ్రెస్ అంటే చీకటి
- ఏది కావాలో ఆలోచించండి
- అభివృద్ధి చేశా.. మరోసారి ఆశీర్వదించండి
- చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్
- రామడుగు మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం

చొప్పదండి, (రామడుగు) నవంబర్ 14 : ''కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మితే మోసపోతం. మోసపోతే గోసపడుతం.. బీఆర్ఎస్ అంటే వెలుగులు.. కాంగ్రెస్ అంటేనే చీకటి. ఏది కావాలో మీరే ఆలోచించి ఓటేయండి'' అని చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రజలకు సూచించారు. ఈ మేరకు మంగళవారం రామడుగు మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించగా, మహిళలు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక బిడ్డనైన తనను మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని చెప్పారు. గతంలో స్థానికేతరులు గెలిచి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేకపోయారని విమర్శించారు. ఎన్నికల ముందు వచ్చి తర్వాత వెళ్లిపోయే నాయకులకు ఈ ప్రాంతం మీద మమకారం ఉండదని, తాను పార్టీలకతీతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందజేస్తున్నాని తెలిపారు. అందరికీ అందుబాటులో ఉంటున్నానని, ఏ ఆపద వచ్చినా అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. అరవై ఏండ్లు పాలించిన కాంగ్రెస్ ఏమీ చేయలేదని విమర్శించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలోని అంశాలను విరించారు. బీఆర్ఎస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వరరావు, సింగిల్ విండో చైర్మన్ ఒంటెల మరళీకృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి తిరుపతి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మార్కొండ కృష్ణారెడ్డి, వివేకానంద, నాయకులు పుడూరు మల్లేశం పాల్గొన్నారు.

# ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తా

- రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే
- కాపాడుకోండి.. కడుపులో పెట్టుకుని చూసుకుంటా
- కరెంటు కావాలా.. కాంగ్రెస్ కావాలా?
- మీరే ఆలోచించి ఓటు వేయండి
- గ్రామాలను ఈటల ఏనాడూ పట్టించుకోలె..
- బీఆర్ఎస్ అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి
- ఇల్లందకుంట, కమలాపూర్ మండలాల్లో ప్రచారం



చిన్నకోమటిపల్లిలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి, మండలి విప్ పాడికౌశిక్‌రెడ్డి

ఇల్లందకుంట/ కమలాపూర్, నవంబర్ 14 : ఈ ఎన్నికల్లో ఆశీర్వదించి గెలిపిస్తే హుజూరాబాద్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి, మండలి విప్ పాడికౌశిక్‌రెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం ఆయన ముందుగా కమలాపూర్ మండలంలోని శంభునిపల్లి, కానిపర్తి, దేశరాజ్‌పల్లి, పంగిడిపల్లి, సాయంత్రం ఇల్లందకుంట మండలంలోని చిన్నకోమటిపల్లి, సీతంపేట, బుజూనూర్, వంతడుపుల గ్రామాల్లో ప్రచారం చేశారు. గ్రామాల్లోని మహిళలు, బీఆర్ఎస్ శ్రేణులు ఈ సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ 24 గంటల కరెంటు ఇచ్చే బీఆర్ఎస్ కావాలా? 3 గంటలు చాలంటున్న కాంగ్రెస్ కావాలా..? ప్రజలు తేల్చుకోవాలని సూచించారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని నియోజకవర్గ ప్రజలంతా కారు గుర్తుకు ఓటేసి గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. కారు గుర్తుకు ఓటేసి కాపాడుకుంటే, నియోజకవర్గ ప్రజలను కడుపులో పెట్టుకుని కాపాడుకుంటానని చెప్పారు. తన ఎన్నికల ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పడుతుంటే తట్టుకోలేని కొంత మంది తనపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఏడుసార్లు ఈటల రాజేందర్‌ను గెలిపిస్తే నియోజకవర్గానికి చేసిందేమీ లేదని, ఉప ఎన్నికల్లో గెలిపిస్తే ఇక్కడి ప్రజల మొఖం చూడలేదన్నారు. ఈసారి తనకు అవకాశం ఇచ్చి మరింత సేవచేసే భాగ్యం కల్పించాలని కోరారు. ఇక్కడ గ్రామ సర్పంచులు సరోజన నాగయ్య, వెంకటస్వామి, అరుణ సదానందం, దిలీప్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ విజయ గణపతి, ఎంపీపీ పావని వెంకటేశ్, ఎంపీటీసీ ఓదెలు, మాజీ వైస్ ఎంపీపీ చుక్క రజింత్, మాజీ సర్పంచులు కుమారస్వామి, సంపత్, ఉప సర్పంచ్ చుక్క రవి, బీఆర్ఎస్ నాయకులు రహీం, రాజిరెడ్డి, సంపత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సమ్మిరెడ్డి, రాజయ్య, రవీందర్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌కు ఓటేయండి

కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయం. అలాంటప్పుడు ఇక్కడ వేరే వ్యక్తి ఎమ్మెల్యేగా ఉంటే ఎలాంటి అభివృద్ధీ జరగదు. ఈ విషయంలో ప్రజలు ఆలోచించాలి. బీఆర్ఎస్‌కు ఓటేసి నా భర్తను గెలిపించండి. ఎమ్మెల్యేగా ఆయన గెలిచిన వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చేలా చూస్తా.

**- శాలినిరెడ్డి, కౌశిక్‌రెడ్డి సతీమణి**